
మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురభి వాణిదేవి

ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహించడం అభినందనీయం: ఎమ్మెల్సీ సురభి వాణిదేవి

కొత్తపేట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ యువతీ యువకుల కోసం ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ సురభివాణిదేవి, కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మునిపల్లె శ్రీనివాస్ అధ్యక్షతన కొత్తపేట శ్రీనివాసఫంక్షన్ హాల్‌లో సోమవారం ఉచిత వివాహ పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహించారు. వేలాది మంది బ్రాహ్మణ యువతీ యువకులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు 2,800 మంది యువతీ యువకుల వివరాలతో సమాఖ్య రూపొందించిన కల్యాణం కమనీయం పుస్తకాని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపల్లి జగన్‌మోహన శర్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ మోత్కూరు రామేశ్వర్‌రావు, గొల్లపూడి రాజేశ్వర్‌రావు, సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

సైదాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వైద్యులు విధులపట్ల నిర్లక్ష్యం వహించకుండా, పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డి సూచించారు. క్రాంతినగర్‌లోని బస్తీదవాఖానాలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఫాతిమాను కార్పొరేటర్ సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది సునీత, బాబు, బస్తీవాసులు కావేటి జగన్నాథం, కోళ్ల గోపీ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ ఫాతిమాను సన్మానిస్తున్న కార్పొరేటర్ అరుణారెడ్డి


ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

యోగా, వ్యాయామం తప్పనిసరిగా చేయాలి

మన్సూరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో క్షణం తీరిక లేకుండా ఉద్యోగాలు, వ్యాపారాల్లో తలమునకలయ్యే వారు యోగా, వ్యాయామం తప్పని సరిగా చేయాలని మన్సూరాబాద్ కార్పొరేటర్, బీజేపీ జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి సూచించారు. డివిజన్ పరిధిలోని చంద్రపురి కాలనీలో రూ.12.50లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను సోమవారం కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి కార్పొరేటర్ ప్రారంభించారు.

నేడు రంగారెడ్డి జిల్లా పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక

ఎల్బీనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ 85 కిలోల విభాగంలో పురుషుల కబడ్డీ జట్టును ఎంపిక చేస్తున్నారు. ఆసక్తిగల క్రీడాకారులు మంగళవారం సరూర్‌నగర్‌లోని ఇండోర్‌స్టేడియంలో హాజరు కావాలని అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రవికుమార్, ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరి 4 నుంచి 7వ తేదీ వరకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే 71వ సీనియర్ అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 7661992581), 9000038272 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అస్మాన్‌ఘడ్ డివిజన్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతు పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు శ్రీపురంకాలనీ, మూసారంబాగ్ ఫీడర్ల పరిధిలోని శ్రీపురం కాలనీ, మనోజ్ మెన్షన్ అపార్ట్‌మెంట్స్, కమ్యూనిటీహాల్ పరిసర ప్రాంతాలు, మూసారాంబాగ్, జ్ఞానదీప్‌టవర్, కృష్ణతులసీనగర్, అండాళ్ నిలయం, దిల్‌సుఖ్‌నగర్ రోడ్డు, ఎస్‌బీహెచ్ బ్యాంకు, ఎస్‌బీఐ కాలనీ, ఇంద్రానగర్, రాజరాజేశ్వరీ టెంపుల్, డీబీఆర్ డయాగ్నస్టిక్ సెంటర్, తనిష్క్ జువలర్స్, నోబుల్ డిగ్రీ కాలేజ్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

సాయిరాంనగర్, గ్రీన్‌పార్కుకాలనీ ఫీడర్‌లలో

చంపాపేట,(ఆంధ్రజ్యోతి): చంపాపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సాయిరాంనగర్‌కాలనీ, గ్రీన్‌పార్కుకాలనీ ఫీడర్‌ల మంగళవారం ఉదయం 10.30గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ కె.శ్రీనివాస్ తెలిపారు. కర్మన్‌ఘాట్, శ్రీనివాస్‌నగర్‌కాలనీ, సాయిరాంనగర్‌కాలనీ, ఆర్‌టీసీ కాలనీ, కేశవనగర్‌లలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో...

సంతోష్‌నగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ డివిజన్ సబ్‌స్టేషన్ పరిధిలో వివిధ పనుల నిర్వహణ నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని డీఈ తెలిపారు. న్యూనాగోల్ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంట వరకు, ఇందిరనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, వీ-గార్డ్, వాంబేకాలనీ, విజయపురి ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని డీఈ తెలిపారు.

కాలుష్య కాసారం

సరూర్‌నగర్ చెరువులో పేరుకుపోతున్న వ్యర్థాలు

- కలుషితమవుతున్న భూగర్భజలాలు
- చెరువులో పెరిగిన గుర్రపు డెక్క
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


సరూర్‌నగర్ చెరువులో వ్యర్థాలు

సైదాబాద్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడూ స్వచ్ఛమైన నీరుండే సరూర్‌నగర్ చెరువు నేడు మురికికూపంగా మారింది. మురుగు, జంతు వ్యర్థాలు, రసాయనాలు చెరువులో కలుస్తుండడంతో దుర్గంధాన్ని వెదజల్లుతోంది. నీరు కలుషితంతో పూర్తి స్థాయిలో డిజాల్వ్‌డ్ ఆక్సిజన్(డీవో) పడిపోవడంతో జలచరాలు సైతం ఆక్సిజన్ అందక కొట్టుమిట్టాడుతున్నాయి. సుందరీకరణ మాటేలా ఉన్నా అధికారులు, నిర్లక్ష్య వైఖరితో సరూర్‌నగర్ చెరువులో మురుగు చేరి కాలుష్య కాసారంగా మారింది. దాంతో పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాలు కలుషితమయ్యాయి. చెరువు పరిసరాల్లోకి వెళ్తే ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. చెరువులో గుర్రపు డెక్క విస్తరిస్తుండడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.


కాలువకు అడ్డంగా పేరుకుపోయిన చెత్తకుప్పలు


చెరువులో తొలగించని గుర్రపు డెక్క

ఆరేళ్లుగా వాకింగ్ ట్రాక్ పనులు

సరూర్‌నగర్ చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు చేపట్టిన వాకింగ్ ట్రాక్(మినీ ట్యాంక్ బండ్) నిర్మాణ పనులు ప్రశ్నార్థకంగా మారింది. ఆరేళ్లుగా పనులు నత్తనడకగా సాగుతుండడంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు ఆరేళ్లుగా కొనసాగుతున్న చెరువు చుట్టూ కట్ట (వాకింగ్ ట్రాక్)తో మరింత కుదించుకుపోయింది. ఇదే అదనుగా ఎఫ్‌టీఎల్ అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. మిషన్ కాకతీయ కింద 2018లో సరూర్‌నగర్ చెరువు అభివృద్ధి, సుందరీకరణ కోసం ప్రభుత్వం సుమారు రూ.15 కోట్ల నిధులు మంజూరు చేసింది.

చెరువు సుందరీకరణలో భాగంగా ముందుగా ఎగువ నీరు వచ్చే వరదనీరు చెరువులోకి రాకుండా చుట్టూ మట్టి కట్టలు ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్‌లుగా వాడుకునే విధంగా నిర్మాణ పనులు ప్రారంభించారు. కానీ ఆశించిన స్థాయిలో జరగడం లేదు. పనుల్లో కదలిక ఇప్పటికైనా వస్తుందేమోనని ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

ఫిర్యాదు చేసినా స్పందన కరువు



సరూర్‌నగర్ చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులు సక్రమంగా జరగడం లేదు. దీంతో గుర్రపు డెక్కలు పేరుకుపోయి దోమలు విజృంభిస్తున్నాయి. అంతేగాకుండా చెరువులో చెత్త, వ్యర్థాలు పారబోస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. చెరువు కాలువలో చెత్తపేరుకుపోయి నీరు బయటకు వెళ్లలేని పరిస్థితి. సదరు కాంట్రాక్టర్, అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి.

\- చిలుకూరి రాంరెడ్డి, శంకేశ్వర్‌బజార్

కొరవడిన అధికారుల పర్యవేక్షణ



లక్షలాది రూపాయలతో చెరువుశుద్ధి, సుందరీకరణ పనులపై అధికారులు పర్యవేక్షణ కొరవడింది. దీంతో చెత్త, గుర్రపు డెక్క తొలగింపు కాంట్రాక్టు పనులు నామమాత్రంగా జరుగుతున్నాయి. ఇప్పటికైనా చర్యలు తీసుకోకుంటే భవిష్యత్తులో మరింత నష్టం జరుగుతుంది. సరూర్‌నగర్ చెరువు క్లీనింగ్, బ్యూటిఫికేషన్, వాకింగ్ ట్రాక్ పనులు వేగవంతం చేయాలి. ప్రజలకు దోమల బెడద, చెరువు నుంచి వెదజల్లే దుర్వాసనలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

\- జంగం శ్వేతారెడ్డి, కార్పొరేటర్, ఐఎస్‌సదన్


జిల్లా వైద్యాధికారికి వినతి పత్రం అందజేస్తున్న పీవైఎల్ ప్రతినిధులు

బాలాపూర్ యూపీహెచ్‌ఎస్‌కు రెగ్యులర్ వైద్యాధికారిని నియమించాలి

సరూర్‌నగర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్, లెనిన్‌నగర్‌లోని బాలాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌ఎస్)కు పూర్తిస్థాయి వైద్యాధికారిని నియమించాలని ప్రగతిశీల యువజన సమాఖ్య(పీవైఎల్) ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం పీవైఎల్ బాలాపూర్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి కొల్లూరి భీమేశ్ ఆధ్వర్యంలో డీఎంఅండ్‌హెచ్‌వోను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భీమేశ్ మాట్లాడుతూ బాలాపూర్ ఆస్పత్రిలో పూర్తి స్థాయి అధికారి లేకపోవడంతో వైద్య సేవలు కుంటుపడుతున్నాయని, డిప్యుటేషన్‌పై నియమించబడ్డ అధికారులు రెగ్యులర్‌గా అందుబాటులో ఉండడంలేదని డీఎం అండ్ హెచ్‌వోకు వివరించారు. వెంటనే ఆస్పత్రికి రెగ్యులర్ వైద్యుడిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో పీవైఎల్ ప్రతినిధులు కొల్లూరి శంకర్, కండ్లపల్లి నరేందర్, గంధమల్ల మహేశ్, మహ్మద్ మౌలానా, రేగోటి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


కవి సిద్ధార్థను సత్కరిస్తున్న కె.శ్రీనివాస్, మామిడి హరికృష్ణ తదితరులు

కవి సిద్ధార్థ కవిత్వం తెలంగాణ అస్థిత్వాన్ని ప్రతిబింబిస్తుంది

రవీంద్రభారతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి సిద్ధార్థ కవిత్వం తెలంగాణ అస్థిత్వాన్ని ప్రతిబింబిస్తుందని సీనియర్ జర్నలిస్ట్ కె.శ్రీనివాస్ అన్నారు. సోమవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జమిలి సాహిత్య సాంస్కృతిక, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సంయుక్త ఆధ్వర్యంలో కవి సిద్ధార్థ సాహిత్య సమాలోచన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కవి సిద్ధార్థ ప్రతి కవితలో తాత్విక ధోరణితో నింపుతూనే అవసరాన్ని బట్టి ధిక్కార స్వరాన్ని వినిపిస్తాడని అన్నారు. తన చుట్టూ ఉన్న మనుషులు, వారితో ఉన్న అనుబంధాలను అక్షరూపంలో పెడతాడని కొనియాడారు. సిద్ధార్థ పదాల్లో నేలతనం ఉట్టిపడుతుందని పేర్కొన్నారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ మాట్లాడుతూ ప్రపంచీకరణ తొలిదశ నుంచి నేటి వరకు తెలంగాణలో వచ్చిన, వస్తున్న మార్పులను, అస్థిత్వవాదాలను తన కవిత్వంలో చూపించడం గొప్ప విషయమన్నారు.

నీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి

- సొంత నిధులతో బోరు వేయించిన కాంగ్రెస్ మహిళా నేత మధుర

మన్సూరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆర్కేపురం డివిజన్, హరిపురికాలనీలో నీటి సమస్యలను పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ మహిళా సీనియర్ నాయకురాలు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. హరిపురి కాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉందని తెలుసుకున్న ఆమె, సోమవారం కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల కృష్ణమూర్తి, సభ్యులతో కలిసి కాలనీలోని మహిళా సంఘం భవనంలో తన సొంత నిధులు బోరు వేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, కాలనీ సభ్యులు నోముల మురళీ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అగాపే బాప్టిస్టు చర్చి వార్షికోత్సవం

కొత్తపేట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కొత్తపేట శ్రీశంకర్ కాలనీలోని అగాపే బాప్టిస్టు చర్చి 34వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. శంషాబాద్ బైబిల్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్యామలరావు ప్రధాన వక్తగా విచ్చేసి బైబిల్ సందేశాలను వినిపించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్‌ను శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. పాస్టర్ బెంజిమన్, చర్చి అధ్యక్షుడు ఆనందం, కార్యదర్శి శ్రీనివాస్, ఈసీ సభ్యులు జోసెఫ్ పాల్గొన్నారు.


హయత్‌నగర్‌లోని తెలంగాణా గిరిజన రెసిడెన్షియల్ కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న సౌమ్య తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు

2 నెలల నుంచి వేరుగా కూర్చోబెట్టి వేధించారు

- అవమానం భరలించలేక ఆత్మహత్య చేసుకుంది
- ఆదివారం రాత్రి హాస్టల్‌లో ఉరేసుకుని సౌమ్య బలవన్మరణం
- గిరిజన రెసిడెన్షియల్ కళాశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన
- బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఆర్డీవో, ఏసీపీ

హయత్‌నగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని తెలంగాణా గిరిజన రెసిడెన్షియల్ కళాశాలకు చెందిన విద్యార్థిని సౌమ్య(17) ఆదివారంరాత్రి హాస్టల్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న విద్యార్థిని తల్లి తండ్రి పద్మా, శివశంకర్ కుటుంబ సభ్యులు సోమవారం కళాశాల వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. కళాశాల సిబ్బంది తమ కుమార్తెను రెండు నెలల నుంచి తరగతిలో వేరుగా కూర్చోబెట్టి వేధించారని, అవమానం భరించలేకనే సౌమ్య ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని, నష్టపరిహారం రూ.20లక్షల నగదు, ప్రభుత్వ ఉద్యోగం, ఇల్లు ఇవ్వాలని బంధువులు, కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. హయత్‌నగర్ మండల ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఏ విద్యార్థి సంఘాల నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు సంఘీభావం తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. పోలీసులు కళాశాల వద్దకు వచ్చి విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, హయత్‌నగర్ తహసీల్దార్ జానకీ, వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి కళాశాలకు చేరుకుని బాధిత కుటుంబ సభ్యులతో చర్చలు జరిపారు. సమస్యను కలెక్టర్‌ను నివేదించి న్యాయం చేస్తామని హామీఇచ్చారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులు హయత్‌నగర్ పోలీస్‌స్టేషకు చేరుకుని సాయంత్రం ఆరు గంటల వరకు పోలీసులతో చర్చలు జరిపారు. 8 గంటల సమయంలో ఎస్ఐ లింగారెడ్డిని సంప్రదించగా ఇంతవరకు బాధితులు ఫిర్యాదు చేయలేదని తెలిపారు. ప్రస్తుతం సౌమ్య మృతదేహం ఉస్మానియా ఆస్పత్రిలో ఉంది.


దాతలతో కలిసి టీన్‌షెడ్‌ను ప్రారంభిస్తున్న ఈఓ లావణ్య

ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలి

చంపాపేట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం ఆలయ ఈవో ఎన్ లావణ్య కోరారు. ఆలయంలోని నవగ్రహ మండపం నుంచి దుర్గామాత ఆలయం వరకు భక్తుల సౌకర్యార్థం నిర్మాణం చేసిన టీన్‌షెడ్‌ను దాతలతో కలిసి సోమవారం ఈవో ప్రారంభించారు. టీన్‌షెడ్డు ఏర్పాటుకు ఆలయ మాజీ ధర్మకర్త బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్, శ్రీలత, రాజులపాటి శ్రీనివాస్, దంటపల్లి వెంకట్‌రెడ్డి, ఉష, గుజ్జ జైవీర్‌రెడ్డి వాణీ, బి. విశాలమనోహర్, ఎస్.శ్రీనివాస్‌గౌడ్ కృష్ణవేణి, కృష్ణప్రదీప్ నివేదిత ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ ధర్మకర్తలు జి.అంజిరెడ్డి, బి. కిరణ్‌కుమార్‌గౌడ్, యాదగిరి, బేర బాలకిషన్, కిల్లామైసమ్మ ఆలయ మాజీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి: సీపీఐ

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి అన్నారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా తట్టిఅన్నారం పరిధిలోని ఆర్‌కేనగర్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డితో కలిసి ఆయన ఎగురవేశారు. కోలాటాల బృందంతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆర్ఎన్ఆర్ కాలనీ ఫేజ్-3లో నివాసం ఉంటున్న గుడిసె వాసులకు ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌కేనగర్ శాఖ కన్వీనర్ బైరగోని రాజు, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర్ హరిసింగ్‌నాయక్, నరసింహ, ప్రసాద్, ఉప్పలయ్య, నరసింహ, సైదులు, జమీనా, చందన, లక్ష్మి పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్‌రెడ్డి

వనస్థలిపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): .తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా వనస్థలిపురానికి చెందిన కె.శ్రీధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ నెల 25, 26 తేదీలలో మధ్యప్రదేశ్ రాష్ట్ర, భోపాల్‌లో జరిగిన భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ జాతీయ కార్యవర్గ సమావేశంలో శ్రీధర్‌రెడ్డిని నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు.


విజయ్‌కుమార్ గౌడ్‌కు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న కెనడా బ్రోమిటోన్ విశ్వవిద్యాలయం ప్రతినిధులు

శిగ విజయ్‌కుమార్ గౌడ్‌కు డాక్టరేట్ ప్రదానం

మన్సూరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ పరిధిలోని సుప్రజా ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శిగ విజయ్‌కుమార్‌గౌడ్‌కు అరుదైన గౌరవం లభించింది. యాదాద్రి జిల్లా మోటకొండూరు మండలం నాంచారిపేటకు చెందిన విజయ్‌కుమార్ పేదవిద్యార్థుల ఉన్నత చదువులకు, వృద్ధులు, గీతకార్మికులకు ఉచిత వైద్యం, కార్మికులకు వైద్యంలో రాయితీ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు. అతడి సేవలను గుర్తించిన కెనడాకు చెందిన బ్రోమిటోన్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో బ్రోమిటోన్ విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి ప్రతినిధులు రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి డాక్టర్ శివప్ప, డాక్టర్ సురేష్ గుప్తా తదితరులు విజయ్‌కుమార్‌గౌడ్‌కి డాక్టరేట్ ప్రదానం చేశారు.

ఐదేళ్లలో రూ.450 కోట్లతో బడంగ్‌పేట్ అభివృద్ధి

పారిశుధ్య సిబ్బంది కృషి వలన స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డు : తాజా, మాజీ మేయర్ పారిజాతారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): తమ ఐదేళ్ల పదవీకాలంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో దాదాపు రూ.450కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని తాజా మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారంతో పదవీకాలం పూర్తి చేసుకున్న ఆమె, సోమవారం బాలాపూర్‌లోని తన నివాసంలో మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్ల పదవీకాలం ఎంతో సంతృప్తినిచ్చిందని, ప్రజలకు చేయాలనుకున్న సేవలను సక్రమంగా అందించామనే భావిస్తున్నామని పారిజాతారెడ్డి అన్నారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, ఎవరు ఎన్నేళ్లు పదవిలో ఉన్నా అన్ని సమస్యలను పూర్తిగా పరిష్కరించలేరని ఆమె పేర్కొన్నారు. ఇప్పటికీ అనేక కాలనీల్లో పలు సమస్యలు ఉన్నాయని, ఇకపై వాటి పరిష్కార బాధ్యత అధికారులదేనని అన్నారు.

అన్ని డివిజన్లను సమానంగా చూశాం..

కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలను సమానంగా చూశామని, స్థానిక సమస్యలు, డివిజన్ విస్తీర్ణాన్ని బట్టి నిధులు కేటాయించామన్నారు. నిధుల కేటాయింపులో సమస్యలను ప్రామాణికంగా తీసుకున్నామేగానీ పార్టీలను, వ్యక్తులను పరిగణనలోకి తీసుకోలేదని మేయర్ స్పష్టం చేశారు. పారిశుధ్య సిబ్బంది కృషి వల్లనే 2022లో కేంద్రం నుంచి బడంగ్‌పేట కార్పొరేషన్‌కు స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డు దక్కిందని అన్నారు.

'గ్రీన్ జోన్' ఎత్తివేయించడంలో ఫెయిలయ్యాం..

కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో గ్రీన్‌జోన్(ఓపెన్ స్పేస్‌జోన్)ను ఎత్తివేయించే విషయంలో తాము సక్సెస్ కాలేకపోయామని పారిజాతారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అది ప్రభుత్వం తీసుకోవాల్సిన విధానపరమైన నిర్ణయమని, పైసాపైసా కూడబెట్టి ఇళ్లు నిర్మించుకున్న మధ్యతరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకుని గ్రీన్‌జోన్ ఎత్తేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. బీఆర్ఎస్ హయాంలో పదేళ్లపాటు నిలిచిపోయిన రూ.89కోట్లు స్టాంప్ డ్యూటీ నిధులు విడుదల చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కబ్జాలపై దృష్టి పెట్టాలి

చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, ఫిరంగినాలా, ప్రభుత్వ స్థలాల కబ్జాపై సంబంధిత ఇరిగేషన్, రెవెన్యూ విభాగాలు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నదని పారిజాతారెడ్డి అన్నారు. తమ పదవీకాలం ముగియగానే సోమవారం నుంచి ప్రత్యేకాధికారుల పాలన అమలులోకి వచ్చిందని, ఆ అధికారులకు తాము సంపూర్ణంగా సహకరిస్తామని ఆమె తెలిపారు. గతంలో బాలాపూర్ సర్పంచ్‌గా సేవలందించానని, తాజాగా బడంగ్‌పేట్ మేయర్‌గా పని చేశానని, భవిష్యత్‌లో మళ్లీ అవకాశం వస్తే ప్రజా సేవచేయడానికి ముందుంటానని అన్నారు.


ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ తాజా మాజీ పాలకవర్గం సభ్యులు

పదవిలో లేకున్నా.. ప్రజా సేవలోనే...

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పదవిలో లేకున్నా.. ప్రజాసేవలోనే ఉంటామని పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ తాజా మాజీ చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు, మాజీ వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. పదవి కాలం పూర్తి అయిన సందర్భంగా సోమవారం లక్ష్మారెడ్డి పాలెంలోని ఓ కన్వెన్షన్‌లో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఐదేళ్ల పదవి కాలంలో కౌన్సిలర్లు తమ వార్డుల్లో చేసిన అభివృద్ధి పనులతో పాటు అధికారులు, ప్రజలతో ఏర్పడిన అనుబంధాలను నెమరేసుకున్నారు. ఈ సందర్భంగా కొంత మంది కౌన్సిలర్లు సమావేశంలో మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. మాజీ చైర్‌పర్సన్ జయశ్రీ, మాజీ వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణరెడ్డి మాట్లాడుతూ పదవి అయిపోయిందని ఇంట్లో కూర్చోకుండా ఎల్లప్పుడు వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లతో పాటు కమీషనర్ రవీందర్‌రెడ్డి, మేనేజర్ కిరణ్‌కుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

హోమియోపతి వైద్యంపై దుష్ప్రచారం తగదు: డాక్టర్ శ్రీనివాస్

సైదాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): హోమియోపతి వైద్యంపై కొందరు అవగాహనలేకుండా దుష్ప్రచారం చేస్తున్నారని హోమియోపతి గ్రాడ్యుయేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్‌బాబు అన్నారు. మంగళవారం సైదాబాద్‌లో ఆయన మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో కొందరు వ్యక్తులు చేస్తున్న అసత్య ప్రచారంతో హోమియోపతి వైద్యులు ఇబ్బందులకు గురవుతున్నారని, హోమియోపతి వైద్యులు సెలైన్ ఎక్కించవద్దని, విటమిన్స్, వ్యాక్సిన్స్ ఇవ్వకూడదని తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని తెలిపారు. అయుష్ నిబంధనల మేరకే హోమియోపతి వైద్యం నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

20 మీటర్లు పూర్తి చేయండి

గాయత్రీ నగర్ వద్ద రోడ్డును కలపకుండా వదిలి వేసిన అధికారులు

హయత్‌నగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రెండు కాలనీలను కలిపేందుకు 20 మీటర్ల సీసీ రోడ్డు కలపకపోవడంతో గాయత్రీనగర్, సాయినగర్ కాలనీల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హయత్‌నగర్ డివిజన్‌లోని ఇన్నర్‌మేషన్‌కాలనీ రోడ్డు నంబర్ 3 నుంచి సత్యనారాయణ కాలనీ, వెంకటాద్రినగర్, వెంకటేశ్వకాలనీ, గాయత్రినగర్ కాలనీలను కలుపుతూ దాదాపు 8 వందల మీటర్ల మేర సీసీ రోడ్డును జీహెచ్ఎంసీ అధికారులు సీసీ రోడ్డును నిర్మిస్తున్నారు. ఇంజాపూర్, మునగనూర్, వెంకటాద్రినగర్, మారం అపార్టుమెంట్, ఇన్నర్‌మేషన్ కాలనీతోపాటు సమీప కాలనీల ప్రజలు వనస్థలిపురం, సాహెబ్‌నగర్, భాగ్యలత తదితర ప్రాంతాలకు వచ్చిపోతుంటారు. వాహనదారులు, పాదచారులతో నిత్యం ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. కానీ మధ్యలో ఉన్న 20 మీటర్ల రోడ్డును కలపక పోవడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చినట్లయింది. ఇప్పటికైన అధికారులు చొరువ తసుకుని మిగిలిన రోడ్డు పూర్తిచేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై హయత్‌నగర్ డివిజన్ ఏఈని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, గాయత్రీనగర్‌ను అనుకునే నల్లగొండ జిల్లా దేశ్‌ముఖ్‌కు చెందిన సాయినగర్ కాలనీ ఉంటుందన్నారు. ఆ రోడ్డు జీహెచ్ఎంసీ పరిధిలోకి వస్తుందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు.